క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మద్దిపాడు: మండల పరిధిలో ఉన్న 11 కేవీ పెదకొత్తపల్లి ఫీడర్‌లోని పెదకొత్తపల్లి, దొడ్డవరప్పాడు, నరసాయ పాలెం, మారెళ్ల కుంటపాలెం, నేలటూరు, గురవారెడ్డిపాలెం, రుద్రవరంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ చెన్నారెడ్డి తెలిపారు. విద్యుత్ లైన్ల వెంట ఉన్న చెట్లు కొట్టించి విద్యుత్ నిరంతరాయంగా సరఫరా చేయడానికి తీసుకుంటున్న చర్యల్లో భాగంగా విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అపుస్మా అధ్యక్షునిగా మురళీ కృష్ణ


అపుస్మా ఒంగోలు నియోజకవర్గ నూతన కార్యవర్గం

ఒంగోలు: ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అపుస్మా) ఒంగోలు నియోజకవర్గ నూతన అధ్యక్షునిగా కె.మురళీకృష్ణ ఎంపికయ్యారు. సోమవారం స్థానిక హైదరాబాద్ పబ్లిక్ స్కూలులో జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీ ఎంపిక జరిగింది. అధ్యక్షునిగా కె.మురళీకృష్ణ, కార్యదర్శిగా ఎ.వంశీకృష్ణ, కోశాధికారిగా ఎస్.ధనుష్, గౌరవాధ్యక్షులుగా సీహెచ్ మల్లికార్జున్, కార్యవర్గ సభ్యులుగా బి.శ్రీనివాసరెడ్డి, జె.వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జోనల్ అధ్యక్షుడు ఏవీ సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు కె.మాధవరావు, కార్యదర్శి వి.హనుమంతరావు, ఒంగోలు నియోజకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రెండు ఇసుక టిప్పర్లు సీజ్


అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసిన ఎస్‌ఐ శివరామయ్యతో సిబ్బంది

మద్దిపాడు: మండలం కేంద్రం మద్దిపాడు సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను ఎస్‌ఐ శివరామయ్య మంగళవారం తెల్లవారు జామున సీజ్ చేశారు. సీజ్ చేసిన టిప్పర్లను స్టేషన్‌కు తరలించి తదుపరి చర్యల కోసం మైనింగ్ డిపార్ట్‌మెంట్‌కు పంపినట్లు తెలిపారు. మండలంలో ఎవరైనా అక్రమంగా ఇసుక తరలించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు

చెడు వ్యసనాలతో జీవితం నాశనం


అవగాహన కల్పిస్తున్న శేషుకుమార్

మార్కాపురం టౌన్: యువత డ్రగ్స్, మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని స్టూడెంట్ యాక్టివిటీ క్లబ్ కోఆర్డినేటర్ ఎం శేషుకుమార్ సూచించారు. మంగళవారం స్థానిక సాధనా డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ నిరోధక కమిటీ ఆధ్వర్యంలో ఏకేయూ వీసీ సూచనల మేరకు ప్రిన్సిపాల్ కప్పగంతుల మధుసూధన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారతదేశం గొప్ప సంపద యువతేనని, మత్తుపదార్థాలకు బానిసై ఆ గుర్తింపును కోల్పోవద్దని హితవు పలికారు. కన్వీనర్ ఎం.రాఘవేంద్ర మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు బానిసైతే విచక్షణ కోల్పోతారని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాల సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రిన్సిపాల్ సూచించారు.తీసుకుంటామని హెచ్చరించారు.



దాడులు చేసినవారిపై రౌడీ షీట్ ఓపెన్ చేయాలి



మహిళా వైద్యులపై అసభ్యంగా ప్రవర్తించడం, దాడులు చేయడాన్ని తీవ్రమైన నేరాలుగా పరిగణించి వారిమీద రౌడీషీట్ ఓపెన్ చేయాలి. అంతకంటే ముందు మద్యం తాగి వచ్చే రోగులను వైద్యశాలలోకి అనుమతించకుండా నిరోధించాలి. ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్ద భద్రతా ఏర్పాట్లు చేయాలి. ఆస్పత్రిలో అన్నీ ప్రధాన పాయింట్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి గట్టి నిఘా పెట్టాలి. వైద్యశాల ఆవరణలో మహిళా వైద్యులకు, చికిత్స కోసం వచ్చే మహిళా రోగులకు భద్రతాపరమైన వాతావరణం కనిపించేలా చర్యలు తీసుకోవాలి. వైద్యుల మీద దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించినప్పుడే మరొకరు అలాంటి దుశ్చర్యలకు పాల్పడకుండా ఉంటారు.

– డా.సమీర్ శర్మ షేక్, త్రోవగుంట పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్, ఒంగోలు

నేరస్తులనే పట్టుకోలేదు..ఇక శిక్షలు ఎప్పుడు వేస్తారు



కోల్‌కత్తా ఘటనతో దేశంలోని మహిళలకు రక్షణ లేదన్న నిజం మరోసారి రుజువైంది. నిర్భయ, దిశ ఘటనలు జరిగినప్పటికీ నేరస్తులకు సరైన శిక్షలు పడలేదు. ఇప్పుడు కూడా జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం జరిగి రోజులు గడుస్తున్నా నేరస్తులను పట్టుకోవడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. నేరస్తులనే పట్టుకోలేని వారు ఇక వారిని ఎలా శిక్షిస్తారన్న ప్రశ్నకు సమాధానం లేదు. ప్రతి విషయాన్ని రాజకీయం చేసినట్టే ఈ హత్యాచారాన్ని కూడా రాజకీయం చేయడం బాధాకరం. ఎలాంటి ఒత్తిళ్లు, ప్రభావాలకు గురికాకుండా నేరస్తులను విచారించాలి. కఠినంగా శిక్షించాలి. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినాతికఠినమైన చట్టాలు చేయాలి.

– డా.లియూ హల్లన్, సీఏఎస్, మాతా శిశు వైద్యశాల, ఒంగోలు

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ


సంతనూతలపాడులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్సై, పోలీస్ సిబ్బంది


హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై దేవకుమార్

చీమకుర్తి: బైక్‌లను నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్‌లను ధరించాలని సంతనూతలపాడు ఎస్సై దేవకుమార్ విజ్ఞప్తి చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు సంతనూతలపాడు బస్టాండ్‌లో బైకులను నడిపే వారికి హెల్మెట్‌ల వినియోగం, వాటి ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. బైక్‌లను నడిపే వారికి ఏదైనా ప్రమాదం జరిగితే వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యుల గురించి గుర్తు చేసుకోవాలన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలను కాపాడటంలో హెల్మెట్ దోహదపడుతుందని తెలియజేశారు. అనంతరం పోలీస్ సిబ్బందితో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు.

హెచ్‌ఐవీ నియంత్రణ సామాజిక బాధ్యత



అవగాహన కలిగిస్తున్న ఏపీ శాక్స్ అధికారులు

ఒంగోలు: హెచ్‌ఐవీ నియంత్రణ అందరి బాధ్యత అని వక్తలు వెల్లడించారు. ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ.. నియంత్రణ సంస్థ, గ్రో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక రాంనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం జరిగింది. పాఠశాల హెడ్మాస్టర్ చంద్రశేఖర శర్మ మాట్లాడుతూ చిన్నారుల్లో అవగాహన పెంచేందుకు మీకు తెలుసా కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఏపీ శాక్స్ అధికారులు, గ్రో ప్రాజెక్టు మేనేజర్ షేక్ పీరు బాషా మాట్లాడుతూ హెచ్‌ఐవీ ఎలా సోకుతుంది, ఎలా వ్యాపించదు, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత, చిన్న చూపు ఉండకుండా వారిపట్ల ఎలా వ్యవహరించాలనే దానిపై పలు సూచనలు చేశారు. హెచ్‌ఐవీ/ఎయిడ్స్ యాక్టు 2017, ఏఆర్‌టీ మందులు, ఏపీశాక్స్ యాప్, టోల్ ఫ్రీ నంబర్ 1097 గురించి అవగాహన కలిగించారు. కార్యక్రమంలో రిమ్స్ ఐసీటీసీ కౌన్సిలర్ పీవీ రంగమ్మ, ఓఆర్‌డబ్ల్యూ భవాని, బ్రాహ్మణి, అరుణ, భారతి, ఏఎన్‌ఎం విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేత్ర దానంతో మరో ఇద్దరికి చూపు


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మజ

ఒంగోలు టౌన్: ఓ వ్యక్తి నేత్ర దానం చేయడం వలన ఇద్దరికి చూపు వస్తుందని, నేత్ర దానం చేస్తే మరణించినప్పటికీ ప్రపంచాన్ని చూడవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఇన్‌చార్జి అధికారి డాక్టర్ పద్మజ అన్నారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి చాంబర్‌లో ఆప్తాల్మిక్ ఆఫీసర్ల సమీక్ష సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ దురదృష్టవశాత్తు కంటి చూపు కోల్పోయిన వారికి కార్నియా ఆపరేషన్ చేయడం ద్వారా తిరిగి చూపు పొందేలా చేయవచ్చన్నారు. కళ్ల జోడు పెట్టుకునే వారు, మధుమేహం, బీపీ, ఉబ్బసం వ్యాధులతో బాధపడేవాళ్లు కూడా నేత్ర దానం చేయవచ్చని వివరించారు. నేత్ర దానం చేయాలనుకునే వారు దగ్గరలోని ఐ బ్యాంక్‌కు ఫోన్ చేయాలని, దగ్గరి బంధువులను, స్నేహితులను, కుటుంబ సభ్యులను నేత్ర దానం చేసేలా ప్రోత్సాహించాలని కోరారు. ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారి డా. నళిని తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని ప్రభుత్వ వైద్యశాలలకు చెందిన నేత్ర వైద్యులు పాల్గొన్నారు. తొలుత నేత్రదానానికి సంబంధించి వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు.

1న శిక్షణ తరగతులు

ఒంగోలు: జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఎఫెక్టివ్ పబ్లిక్ స్పీకింగ్ శిక్షణ తరగతులు స్థానిక శ్రీహర్షిణి డిగ్రీ కాలేజీలో సెప్టెంబర్ 1న నిర్వహిస్తున్నట్లు జేసీస్ అధ్యక్షుడు వరుణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. మంచి స్పీకర్ కావడం ఎలా అనే అంశంపై ఎఫెక్టివ్ పబ్లిక్ స్పీకింగ్ శిక్షణ ఉంటుందన్నారు. ఈ శిక్షణ తరగతులకు ప్రధాన శిక్షకులుగా కె.గోపీకిషోర్, రామాంజనేయులు, ప్రాజెక్టు చైర్మన్‌గా రవికుమార్ వ్యవహరిస్తారన్నారు. 16 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాల్లోపు వారు ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు అర్హులన్నారు. శిక్షణకు గాను జేసీస్ సభ్యునికి రూ. 300, ఇతరులు రూ. 500 చెల్లించాలన్నారు. సర్టిఫికెట్, భోజన వసతి, స్నాక్స్, ప్రత్యేకమైన బహుమతులు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు 8885887165, 8297312111 నంబర్లను సంప్రదించాలన్నారు.

గ్రామీణ వైద్యుల కమిటీ ఎన్నిక


ఎన్నికల ఫలితాలు ప్రకటిస్తున్న దృశ్యం

ఒంగోలు టౌన్: గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం 2024–26 ఒంగోలు మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక రంగరాయుడు చెరువు వద్ద ఉన్న బ్రాహ్మణ సంఘ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా పెళ్లూరి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా పెండెం వెంకట కృష్ణారావు, కోశాధికారిగా జానా శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. గుంటూరు భాస్కరరావు, బట్టు బాలాజీ, కందుకూరి రాజగోపాల్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. సమావేశంలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.నాగరాజు, డివిజన్ కార్యదర్శి అద్దంకి లెనిన్, మహిళా కమిటీ అధ్యక్షురాలు ఆంటోనమ్మ, కార్యదర్శి శాంతి, కోశాధికారి స్వర్ణశ్రీ తదితరులు పాల్గొన్నారు. గ్రామీణ వైద్యులకు ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వాలని సమావేశం తీర్మానించింది.

సింగరాజుకు ఘన నివాళి


మాట్లాడుతున్న చెన్నుపాటి మంజుల

ఒంగోలు సెంట్రల్: ఉపాధ్యాయ ఉద్యమ రథసారధి సింగరాజు రామక్రిష్ణయ్య ఉద్యమాన్ని నిర్మించి దేశంలోనే ఉపాధ్యాయులకు సంఘాలకు గుర్తింపు తెచ్చారని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నుపాటి మంజుల అన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఉపాధ్యాయ ఉద్యమ రథసారథి సింగరాజు రామక్రిష్ణయ్య 22వ వర్ధంతి సభ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్ రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మాజీ రాష్ట్ర కార్యదర్శి బి. రఘబాబు మాట్లాడుతూ సింగరాజుతో తనకు ఉన్న అనుబంధాన్ని, సమావేశాల సమయంలో ఆయన తీరు తెన్నులను వివరించారు. పూర్వపు రాష్ట్ర కౌన్సిలర్ ఎంవీ క్రిష్ణయ్య మాట్లాడుతూ సింగరాజు నాయకత్వంలో రాష్ట్రంలో ఉపాధ్యాయ ఉద్యమం దేశంలోనే అగ్రగామిగా నిలబడిందన్నారు. మాజీ రాష్ట్ర కార్యదర్శి ఐ. విజయసారధి మాట్లాడుతూ ఉపాధ్యాయులు సంఘాలు పెట్టుకొని హక్కుల సాధనకు మార్గం చూపారన్నారు. మాజీ జిల్లా కార్యదర్శి పరిటాల సుబ్బారావు, జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి డి. శ్రీనివాసులు, సీనియర్ నాయకులు రవి, యోహాన్ రెడ్డి, శేషా రావు, హనుమంతరావు, తిరుమల, ఎం. అనిత పాల్గొన్నారు. ముందుగా సింగరాజు రామక్రిష్ణయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

వాటర్ స్కీం పరిశీలన


వాటర్ స్కీంను పరిశీలిస్తున్న అధికారులు

నాగులుప్పలపాడు (మద్దిపాడు): వాటర్ స్కీం పథకంతో నిర్మాణం చేపట్టిన పథకం వలన పశువుల తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉందని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ షేక్ మర్దన్ అలీ అన్నారు. చదలవాడ పశుక్షేత్రంలో గతంలో నిర్మించిన వాటర్ స్కీంను మంగళవారం సిబ్బందితో పరిశీలించిన ఎస్ఈ పశువుల తాగునీటి అవసరాలు, పశువుల పచ్చిమేతకు వాడే నీటికి సరిపడా ఉండటం సంతోషకరమన్నారు. అనంతరం ఒంగోలు జాతి పశువులను పరిశీలించారు. డీడీ రవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు ఉన్నారు.

పారిశ్రామిక రక్షణపై సదస్సు


మాట్లాడుతున్న నరసింహారావు

ఒంగోలు: పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం ఇండస్ట్రియల్ సేఫ్టీపై అవగాహన సదస్సుతో పాటు విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. విజయవాడ రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు సీనియర్ ఇంజినీర్ యస్.నరసింహారావు పరిశ్రమలో పాటించాల్సిన జాగ్రత్తలు, ఉద్యోగ అవకాశాలను గురించి వివరించారు. కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ నైపుణ్యం కలిగిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు అపారమన్నారు. దానికి తగిన విధంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కోరారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి మాట్లాడుతూ పరిశ్రమల్లో పనిచేసేటప్పుడు జాగ్రత్తలు అవసరమన్నారు. ట్రిపుల్ ఇ, విభాగం అధిపతి బి.నాగరాజు, కోఆర్డినేటర్ కేవీ నారాయణ, కో కన్వీనర్ బి.వెంకటేష్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


మహాగణపతి హోమంలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: స్థానిక శ్రీనగర్ కాలనీ మొదటి లైన్ లో విజయ గణపతి దేవాలయంలో మంగళవారం సప్తమ వార్షికోత్సవం ఆలయ నిర్వాహకులు అర్చక స్వాములు వైభవంగా నిర్వహించారు. విజయ గణపతి మూలవిరాట్‌కు పూజలందించారు. ఆలయ కమిటీ సభ్యులు, శ్రీనగర్ కాలనీ భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దమ్మతల్లి ఉత్సవం


అలంకరణలో పెద్దమ్మతల్లి


బోనాలతో అమ్మవారి ఆలయానికి వస్తున్న భక్తులు

కొనకనమిట్ల: మండలంలోని కాట్రగుంట గ్రామంలో మంగళవారం రాచూరి పెద్దమ్మతల్లి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రతిష్ఠ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామస్తులతోపాటు వడ్డెర కాలనీ, తన్నీరువారిపల్లి వాసులు బోనాలతో మేళతాళాల నడుమ అమ్మవారి సన్నిధికి చేరుకున్నారు. వేదపండితుడు నారాయణశర్మ పూజలు నిర్వహించారు. ఉభయదాతలతో సహస్రనామ పూజలు చేయించారు. పెద్ద సంఖ్యలో భక్తులకు అన్న సంతర్పణ చేశారు. మంగళవారం రాత్రికి అమ్మవారి గ్రామోత్సవం కనుల పండువగా సాగింది.

గురుకుల పాఠశాల విద్యార్థినుల ప్రతిభ


తైక్వాండోలో పతకాలు సాధించిన మౌనిక


రేజ్లింగ్‌లో పతకాలు సాధించిన గురుకుల పాఠశాల విద్యార్థినులు

లింగసముద్రం: రాష్ట్రస్థాయి రేజ్లింగ్ పోటీల్లో, అంతర్జాతీయ తైక్వాండో పోటీల్లో మండలంలోని పెదపవని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి బంగారు, సిల్వర్, కాంస్య పతకాలతో పాటు గ్రీన్‌బె బెల్ట్ సాధించినట్లు ప్రిన్సిపాల్ స్నేహలత తెలిపారు. పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ఏ.మౌనిక విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఈ నెల 22, 23, 24 తేదీల్లో జరిగిన అంతర్జాతీయ తైక్వాండో పోటీలలో గ్రూప్–బిలో స్పైరింగ్‌లో సిల్వర్, గ్రీన్‌బెల్ట్ సాధించడంతో పాటు 33,37 కేటగిరి స్పైరింగ్‌లో కాంస్య పతకంతో పాటు కలర్ బెల్ట్ సాధించినట్లు తెలిపారు. అలాగే రాష్ట్రస్థాయిలో రేణిగుంటలో జరిగిన రేజ్లింగ్ పోటీల్లో పాఠశాలకు చెందిన డి.సమీరా బంగారు పతకం సాధించగా ఎం.మేఘన, పి.అనుదీవెన, డి.క్రాంతి, కె.లక్ష్మీప్రసన్నలు సిల్వర్ పతకాలు సాధించారు. జె.అలేఖ్య, జె, అక్షయ, బి.మహాలక్ష్మిలు కాంస్య పతకాలు సాధించినట్లు చెప్పారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పతకాలు సాధించిన విద్యార్థినులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.


భగవాన్ మురళీకృష్ణ మందిరంలో ఉట్టి కొడుతున్న చిన్నారి


అనంత కోదండరామ స్వామి మందిరంలో భగవద్గీత పారాయణలో పాల్గొన్న మహిళలు


రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణుని కళ్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు


భగవాన్ మురళీకృష్ణ మందిరంలో రాధాకృష్ణుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

ఒంగోలు మెట్రో: గోకులాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం శ్రీగిరి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో యాదవ రాజుల సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీకృష్ణుని విగ్రహాన్ని పూలమాలలతో చక్కగా అలంకరించారు. అనంతరం వేంకటేశ్వర స్వామి సన్నిధిలో యాదవ రాజులు సన్నిధి గొల్లలు నరసింహారావు, శ్రీనివాసరావు, లాయర్ ధనవర్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ రాధా గోవిందాశ్రమంలో..

గోకులాష్టమి పండగ పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం మధ్యాహ్నం శ్రీ రాధా గోవింద ఆశ్రమంలో శ్రీకృష్ణుని అభిషేకాలు నిర్వహించారు. 108 రకాల పిండి వంటలను సమర్పించారు. మారుతి కృష్ణమోహనాచార్యులు, శ్రీనివాస స్వామి పాల్గొన్నారు. అలాగే బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలోని స్థానిక పీవీ ఆర్ గర్ల్స్ హై స్కూల్ దగ్గర గడియారం వారి వీధిలో వెలసిన శ్రీ అనంత కోదండ రామస్వామి దేవస్థానంలో గోకులాష్టమి వేడుకలను నిర్వహించారు. అలాగే స్థానిక మస్తాన్ దర్గా దగ్గర గోకుల గోపాలకృష్ణ దేవాలయంలో ఆలయ నిర్వాహకులు నిమ్మకాయల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుని కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

భగవాన్ మురళీకృష్ణ మందిరంలో..

స్థానిక మంగమూరు డొంక అయ్యప్ప నగర్‌లో భగవాన్ మురళీకృష్ణ మందిరంలో మంగళవారం ఉదయం పది గంటలకు ఆలయ నిర్వాహకులు ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు రుక్మిణి శ్రీకృష్ణుని కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


శ్రీ రాధా గోవింద ఆశ్రమంలో 108 రకాలతో నివేదన